

ఆర్గానిక్ సాగులో 'రాజు'

కాన్పూర్ ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన సిమ్మ అప్పలరాజు లక్షలాది రూపాయల జీతాన్ని వదిలి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేశారు. - 8లో



రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి

బొండపల్లి మండలంలోని అంబటివలస–నెలివాడ జంక్షన్‌ల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. - 8లో




బియ్యం మాత్రమే పంపిణీ..!

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఈ నెల పంపిణీ చేసే రేషన్ సరుకుల్లో బియ్యం మాత్రమే కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

13న తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల



తోటపల్లి జలాశయం

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలోని పాతఆయకట్టుకు ఈ నెల 13న సాగునీరు విడుదల చేస్తామని జలవనరుల శాఖ డీఈఈ దమలపాటి రవికుమార్ మంగళవారం తెలిపారు. పార్వతీపురం మన్యంతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేస్తామన్నారు. జలాశయం పరిధిలోని చెరువులను నింపేందుకు తొలుత ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ప్రణాళికా బద్ధంగా 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి వినతి



కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలో క్యాన్సర్ అస్పత్రి నిర్మించి ఉమ్మడి విజయనగరం జిల్లాతో పాటు, శ్రీకాకుళం జిల్లాలోని క్యాన్సర్ రోగులకు వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌కు లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి విన్నవించారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కీమో, రేడియో థెరపీల కోసం రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కేంద్రాస్పత్రిలో అత్యవసరంగా క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేయాలని విజ్ఞప్తిచేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పి.ప్రభాకరరావు, జె.రామచంద్రరాజు, టి.రాజారావు, పి.అప్పారావు, సిమ్మ శ్రీను, బి.భాస్కర్, తదితరులు ఉన్నారు.

కారుణ్య నియామకం



సూర్య ప్రభాకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ డి.రాఘవేంద్రరావు మృతిచెందారు. కారుణ్య నియామకంలో భాగంగా ఆయన కుమారుడు సూర్యప్రభాకర్‌ను గరుగుబిల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నియమిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం తన కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కోట సత్తెమ్మతల్లి తెప్పోత్సవం



పెద్దచెరువులో సత్తెమ్మతల్లి తెప్పోత్సవం

విజయనగరం టౌన్: విజయనగరం రామానాయుడు రోడ్డులోని కోటసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం పెద్దచెరువులో నిర్వహించిన తెప్పోత్సవం కనులపండువగా సాగింది. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను పట్టణంలో ఊరేగింపు చేశారు. మంగళవాయిద్యాలు, బాణాసంచా, విద్యుత్ దీపాలు, చిన్నారుల సాముగరిడీ, కోలాటం, పులివేషాలతో ప్రారంభమైన ఊరేగింపు గంటస్తంభం కూడలి, కన్యకపరమేశ్వరీ ఆలయం, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ కూడలి మీదుగా తిరిగి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఒబ్బిలిశెట్టి రాంజీ, కమిటీ ప్రతినిధులు పేర్ల సీతారామయ్యశెట్టి, ఒబ్బిలిశెట్టి ఏడుకొండలు, నరసింగరావు, త్రినాథరావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై ఉక్కుపాదం



ఈ చిత్రంలో పోలీసుతో ఉన్న వ్యక్తి పేరు బూర పైడి రాజు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల కేంద్రంలో గ్రామ వలంటీరు. వలంటీర్లందరిలోనూ కాస్త ఎక్కువ క్రియాశీలకంగా ఉంటాడు. ఇప్పుడదే కూటమి ప్రభుత్వ కన్ను పడటానికి కారణమైంది. 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి హాజరవ్వకుండా గృహనిర్బంధం చేసింది. తాను విజయవాడ వెళ్లడం లేదని మొత్తుకున్నా పోలీసులు వినిపించుకోలేదు. మంగళవారం అంతా పైడిరాజును గృహనిర్బంధంలోనే ఉంచారు.



- ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు అరచేతిలో వైకుంఠం
- గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని హామీ
- వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ప్రగల్భాలు
- అవసరం తీరాక పక్కకు నెట్టేసిన టీడీపీ ప్రభుత్వం
- పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగించని వైనం
- నమ్మకద్రోహంపై రగిలిపోతున్న వలంటీర్లు
- విజయవాడలో ఆందోళనకు సిద్ధం
- క్రియాశీల వలంటీర్లను గృహనిర్బంధం చేసిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వలంటీర్లకు వెన్నుపోటు పొడిచింది. ఎన్నికల్లో గట్టెక్కడానికి అరచేతిలో వైకుంఠం చూపించిన చంద్రబాబే ఇప్పుడు వారిపై వేటు వేసే దిశగానే అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ ద్రోహాన్ని ఆలస్యంగా గ్రహించిన వలంటీర్లు బుధవారం విజయవాడలో ఆందోళనలకు దిగుతున్నారు. 'ఛలో విజయవాడ' పేరుతో అంతా ఏకమై ప్రభుత్వానికి తమ గళం వినిపించాలని సన్నద్ధమవుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం వారిపై ఉక్కుపాదం మోపింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ఏ ఒక్కరూ ఆ కార్యక్రమానికి పోకుండా గృహనిర్బంధం చేసేసింది. మంగళవారం తెల్లారకముందే పోలీసులు వలంటీర్ల ఇంటిముందు చక్కర్లు కొట్టారు. ఎవరెవరూ సంఘాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారనేదీ స్పష్టమైన సమాచారంతో వారి కదలికలపై నిఘా ఉంచారు. విజయవాడ వెళ్లే అవకాశం ఉందని ఏమాత్రం అనుమానం ఉన్నా పోలీసులు వారిని హౌస్ అరెస్టు చేసేశారు.

మహోన్నత ఉద్దేశానికి మంగళం

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మానస పుత్రికగా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ పేరొందాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, తద్వారా అభివృద్ధిని ప్రజలకు చేరువచేసిన అద్భుత వ్యవస్థ అని దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురిసింది. ఆంధ్రప్రదేశ్ ఈ వ్యవస్థతో దేశానికే ఒక రోల్‌మోడల్‌గా నిలిచింది. గత 2014–19 పాలనలో చంద్రబాబు మానసపుత్రులైన జన్మభూమి కమిటీ సభ్యుల వేధింపులతో నలిగిపోయిన రాష్ట్ర ప్రజలకు గత ఐదేళ్లూ ఈ వ్యవస్థతో గొప్ప ఊరట లభించింది. ఆ కమిటీల్లా కమీషన్ల కోసమో, రాజకీయ కక్షల కోసమో గాకుండా ప్రజాసంక్షేమం, సమసమాజ నిర్మాణం ద్వారా అభివృద్ధి సాధనే లక్ష్యంగా పనిచేసింది. గాంధీజీ కన్న కలలను స్వాతంత్ర్యం సిద్ధించిన ఇన్నాళ్లకు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారం అయ్యేలా ఒక సాధనమైంది. ఇదంతా అప్పట్లోనే టీడీపీ, జనసేన నాయకులకు వలంటీర్లపై అసూయ కలిగించింది. వలంటీర్లు కాదు... వైకాపా వేగులంటూ రాజకీయ ముద్ర వేశారు. అసాంఘిక శక్తులంటూ బట్టకాల్చి మీద వేశారు. సమాజంలో అత్యంత దారుణమైన మహిళల అక్రమ రవాణా ఆరోపణలూ చేశారు. అన్నివిధాలా బురదజల్లి చివరకు ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రజాసేవకు దూరం చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే ముద్ర వేసి 'అనర్హత' వేటు వేయించడం మొదలెట్టారు. ఈ వేధింపులు తట్టుకోలేక విజయనగరం రూరల్ మండలంలో ఓ మహిళా వలంటీర్లు గుండె ఆగిపోయిందంటే అవే స్థాయిలో సాగాయో అర్థం చేసుకోవచ్చు.

మాయావలయంలో చిక్కుకొని గిలగిల

వలంటీర్ల వ్యవస్థను ఆదిలోనే తుంచేయాలని కుట్రలు జరిగాయి. 2019 ఆగస్టులో దీన్ని ఏర్పాటు సమయంలోనే అడ్డుకునేందుకు కోర్టుకెళ్లారు. హైకోర్టు ఆ వ్యాజ్యాన్ని కొట్టేయడంతో న్యాయ మార్గం మూసుకుపోయింది. దీంతో ఎల్లోమీడియా ద్వారా బురదజల్లుడు మొదలుపెట్టారు. వలంటీర్లంతా తమ సొంత గ్రామాల్లోనే సేవలందిస్తున్నా వారినొక మాఫియాగా, అసాంఘిక శక్తులుగా చూపించారు. మగాళ్లు లేనప్పుడు ఇంటికెళ్లి తలుపు తడుతున్నారని, మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారని విషప్రచారానికి తెరతీశారు. అమ్మాయిలను అపహరించేస్తున్నారంటూ వారి నైతికతను దెబ్బతీసే ప్రచారాన్నీ హోరెత్తించారు. ప్రజల్లో ఆ వ్యవస్థ పట్ల ఉన్న గౌరవాన్ని తగ్గించి నైతికంగా దెబ్బకొట్టాలనే కుట్రలన్నీ సాగాయి. మరోవైపు 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్వరం మార్చారు. వలంటీర్లపై ప్రేమ కురిపించారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామన్నారు. గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారాన్ని గట్టిగా నమ్మిన వలంటీర్లు చాలామంది కూటమి వైపే మొగ్గు చూపించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం వలంటీర్లకే మొదట ఝలక్ ఇచ్చింది. ఏకంగా ఆ వ్యవస్థకే ఎసరుపెట్టే పనిలో ఉంది.

ఆందోళన దిశగా అడుగులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నెల రోజుల్లోపే ఆందోళనలు మొదలయ్యాయి. ఎన్నికల్లో గట్టెక్కడానికి తమకు అరచేతిలో వైకుంఠం చూపించిన చంద్రబాబు సహా కూటమి నాయకులు ఇప్పుడు ముఖం చాటేయంపై రగిలిపోతున్నారు. విజయనగరం జిల్లాలో 10,828 మంది వలంటీర్లకు గాను 6,588 మంది రాజీనామా చేశారు. వారంతా తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన చేస్తున్నారు. మరోవైపు రాజీనామా చేయని 4,240 మంది వలంటీర్లు తమను సేవల్లోకి తీసుకోవాలని, హామీ ప్రకారం గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 5,647 మంది వలంటీర్లకు గాను సుమారు 2,700 మంది రాజీనామా చేశారు. ఈ వలంటీర్లంతా 'ఛలో విజయవాడ'కు పిలుపు ఇచ్చారు.

అశోక్‌ను కలిసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్: కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు పి.అశోక్ గజపతిరాజును రాష్ట్ర శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు మంగళవారం అశోక్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనసభ స్పీకర్‌గా ఎన్నికై తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు అశోక్ గజపతిరాజు, ఆయన కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ స్థాపించినప్పటి నుంచి ఇద్దరం పార్టీలో ఉన్నామన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వారు 88 మంది ఉన్నారని తెలిపారు. వారికి సభలో వ్యవహరించాల్సిన తీరు, సభ సంప్రదాయాలు, ప్రజా సమస్యల ప్రస్తావన, ఇతర అంశాలపై శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ నాయకులను ఆహ్వానించి వారి అనుభవాలను తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో పంచుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పీకర్ పదవికి వన్నెతెచ్చేలా సభను నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్ర సమస్యలపై ఇరువురు ముఖ్య మంత్రులు భేటీ ఆహ్వానించదగ్గ పరిణామంగా పేర్కొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పరిశీలన



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని సందర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, అతిది గజపతిరాజు, ఇతర అధికారులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగాలు, వార్డులు, ఎంఆర్ఐ స్కాన్, ఎక్సరే, సిటీస్కాన్, లేబొరేటరీ, బ్లడ్ బ్యాంక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత మెరుగుపరచాల్సి ఉందన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆస్పత్రిలో పబ్లిక్ టాయిలెట్‌లు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులు మంత్రిని కోరగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ మల్లయ్యనాయుడుకు సూచించారు. ఆస్పత్రి ఆవరణలో రెండు బోర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వర్షాకాలం వచ్చినందున ఆస్పత్రిలో లీకేజీలు ఏమైనే ఉంటే వాటిని నివారించాలని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం వైద్యులతో సమావేశం నిర్వహించారు.

జీతాలు ఇప్పించాలని మంత్రికి వినతి

జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలంటూ సర్వజన ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన మంత్రి శ్రీనివాస్‌కు ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్స్, జనరల్ అటెండెంట్స్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు పి.అదితి గజపతిరాజు, కోళ్ల లలితకుమారి, కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, డీసీహెచ్ఎస్ బి.గౌరీశంకర్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఏపీహెచ్ఎంఐడీసీ సంస్థ ఎస్ఈ శివకుమార్, ఈఈ ప్రసాద్, ఆర్ఎంఓ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుని రథయాత్రకు

చకచకా ఏర్పాట్లు



పాలకొండ రూరల్: జగములనేలు జగన్నాథుని రథయాత్రను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. పాలకొండలో వెలసిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథోత్సవాలకు ఆలయం సుందరంగా ముస్తాబు చేశారు. ఇక్కడ వెలసిన స్వామివారు ఐదు శతాబ్దాల పైబడి పూజలు అందుకుంటున్నారని ప్రతీతి. ఒడిసా రాష్ట్రం పూరీలో కొలువైన స్వామి వారికి అర్పించే సేవలను, కై ంకర్యాలను అనుసరించి ఇక్కడ ఉత్సవాలు చేపట్టనున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి తొలిదశమి పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కోనూరు సర్వేశ్వరరావు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణకు రూ.4లక్షల మేర దేవదాయ, ధర్మాదాయ శాఖ కేటాయించనుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఉత్సవాల్లో కీలకమైన హిరాపంచమి 11వ తేదీ గురువారం జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. పది రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కో అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆఖరిరోజు ఈ నెల 17వ తేదీ బుధవారం స్వామి ప్రధాన ఆలయంలోకి తిరిగి ప్రవేశించడంతో యాత్ర ముగియనుందని ఆలయ ప్రధాన అర్చకులు మఠం విశ్వనాథదాసు స్పష్టంచేశారు. యాత్రా మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు డీఎస్పీ జి.వి.కృష్ణారావు తెలిపారు. భక్తులు పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆనకట్టకు వరద పోటు



ఆనకట్టనుంచి దిగువకు వెళ్తున్న నీరు

సంతకవిటి: ఇటీవల కురిసిన వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. సంతకవిటి మండలం రంగారాయపురం వద్దగల నారాయణపురం ఆనకట్ట నుంచి 1500 క్యూసెక్కుల నీరు కిందకు ప్రవహిస్తోంది. ఖరీఫ్ పంటల సాగుకు ఇది సానుకూల పరిస్థితిగా ఆనకట్ట అధికారులు చెబుతున్నారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయ స్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రధాన ముఖద్వారం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం నూతన వస్త్రాలతో స్వామిని సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించారు. స్వామి సన్నిధిలో హనుమాన్ ఛాలీసా పఠించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు సాయిరామాచార్యులు, పవన్, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలు షురూ

- ఈఏపీ సెట్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 22వ తేదీతో ముగింపు
- జేఎన్‌టీయూ జీవీ పరిధిలో 25 ఇంజినీరింగ్ కళాశాలలు
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9 కళాశాలల్లో 5 వేల సీట్లు
- ఆన్‌లైన్‌లో ఎంపికపై జాగ్రత్తలు పాటించాలి: హెల్ప్‌లైన్ కన్వీనర్



విజయనగరం అర్బన్:

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల సందడి మొదలైంది. ప్రభుత్వం ఎట్టకేలకు ఈఏపీ సెట్ ప్రవేశాల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో విద్యార్థులు కళాశాలలతో పాటు కోర్సుల ఎంపికపై శోధిస్తున్నారు. ఏ కోర్సు చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది, ఏ కళాశాలలో అయితే భవిత బాగుంటుందనే విషయ సేకరణలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు.

నోటిఫికేషన్ షెడ్యూల్ వివరాలు

ఈఏపీ సెట్–24 పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులు. ఈ ప్రవేశాల కోసం 'సీఈటీఈఆర్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోని ఈఏపీ సెట్–24 అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి. వచ్చిన రిజిస్ట్రేషన్ ఫారంతో హాల్‌టికెట్, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించాలి. అందులో వివరాలు పూర్తిచేసి సబ్‌మిట్ చేయాలి.

గత ఏడాది నుంచి ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు 10 శాతం కోటా

విద్యార్హతలోని పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్, కుల, ఆదాయం, నివాస ధ్రువీకరణ, ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, రేషన్‌కార్డు జిరాక్స్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గత ఏడాది నుంచి ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి సీట్ల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా..

జూలై 7వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ఉంటుంది. ఇందులో వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.600 ఫీజును ఆన్‌లైన్‌లో క్రెడిట్‌కార్డు లేదా డెబిట్‌కార్డు, నెట్ బ్యాంక్ ద్వారా ఫీజును చెల్లించాలి. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు జరుగుతుంది. జూలై 8 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 13వ తేదీ వెబ్ ఆప్షన్లు మార్పునకు అవకాశం ఇస్తారు. 16న సీట్ల కేటాయింపు, 17వ తేదీ నుంచి 22వ తేదీ మధ్యలో కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలి. ఇంజినీరింగ్ తరగతులు 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి.


పలు కళాశాలల్లో కొత్త కోర్సులు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతో పాటు ఈ ఏడాది కొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. సీఎస్ఈలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్‌లెర్నింగ్, సైన్స్ రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, మెరైన్, మైనింగ్ వంటి కొత్త బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. మంచి ర్యాంకులు వచ్చిన చాలా మంది విద్యార్థులు ఫస్ట్ ఆప్షన్ కింద సీఎస్‌సీ గ్రూప్‌లో చేరేందుకు ఆసక్తి కనబరచగా రెండవ ఆప్షన్ కింద ఈసీఈలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం.

జేఎన్‌టీయూ జీవీ పరిధిలో 25 ఇంజినీరింగ్ కళాశాలలు

జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో 25 ఇంజినీరింగ్, 14 ఫార్మా కళాశాలలు ఉన్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9 ఇంజినీరింగ్, 6 ఫార్మా కళాశాలలు ఉన్నాయి. వీటిలో అన్ని కోర్సులకు కలిసి దాదాపు 5 వేల సీట్లు ఉన్నాయి. జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల ఒక్కటే ప్రభుత్వ కళాశాల. ఇందులో ఐదు కోర్సులకు చెందిన దాదాపు 400 సీట్లు ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో ఎంపికపై జాగ్రత్తలు పాటించాలి



ఈఏపీ సెట్‌లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నుంచి ఆన్‌లైన ఫీజు చెల్లింపు, కళాశాల, కోర్సు ఎంపిక సమయంలో విద్యార్థులు జాగ్రతలు పాటించాలి. ఇంటర్నెట్ కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసినపుడు విద్యార్థులు దగ్గరుండి స్వయంగా చూసుకోవాలి. స్నేహితులు, మరొకరి సహకారంతో ఆన్‌లైన్ ద్వారా ఎంపికచేస్తే తప్పులు జరిగే అవకాశం ఉంటుంది. విద్యార్థులే స్వయంగా వెళ్లి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్‌లైన్ కేంద్రానికి రావచ్చు.

– జె.ఆశారమణి, హెల్ప్‌లైన్ కన్వీనర్, ప్రిన్సిపాల్, ఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, విజయనగరం

విద్యార్థులు పరిశీలించుకోవాల్సిన అంశాలు

విద్యార్థులు కళాశాలల్లో చేరే ముందు నాక్, ఎన్‌బీఏ వంటి జాతీయ స్థాయి గుర్తింపు ఉందా లేదా అని గమనించాలి. ప్రవేశాలు, ప్లేస్‌మెంట్ ఎలా ఉన్నాయనే విషయాలను ఆరా తీసి పూర్వ విద్యార్థుల ఫీడ్ బ్యాక్ ఆధారంగా చేరితే మంచిది. కళాశాల మీద అవగాహన లేకుండా చేరడం వల్ల భవిష్యత్తులో ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. బ్రాంచ్ కంటే కూడా కళాశాల ఎంపికే కీలకమనే విషయాన్ని గర్తుంచుకోవాలన్నది మేధావుల మాట.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చదురుగుడి, వనంగుడిలలో మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం


- జేసీ కార్తీక్



ఉత్పత్తులను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: ప్రజల ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సి ఉందని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబం, తమ ఆరోగ్యం కోసం ఈ ఉత్పత్తులనే వినియోగించాలని పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలను జాయింట్ కలెక్టర్ కార్తీక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిలాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతు శాస్త్రవేత్తలు, మెంటార్‌లు ఏటీఎం, ఏ1 విధానాల ద్వారా పండించిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను తిలకించి ఆయా వ్యవసాయోత్పత్తుల పంట దిగుబడి, లభిస్తున్న ఆదాయం, వాటి మార్కెటింగ్ అంశాలపై రైతులు, వ్యవసాయ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం డీడీ ఆనంద్, వ్యవసాయ శాఖ డీడీలు ప్రకాశ్, హేమసుందర్, ఏపీపీఎస్ఎఫ్ ప్రతినిధి రమేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రత్నం తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి వినతుల వెల్లువ



సమస్యలను పరిష్కరించాలని మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

సాలూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ పాఠశాలల స్వీపర్లు వేర్వేరుగా వినతి పత్రాలను స్త్రీ శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి మంగళవారం అందజేశారు. ఈ మేరకు మంత్రి సంధ్యారాణిని పట్టణంలోని ఆమె స్వగృహంలో వారు కలిశారు. ఈ సందర్భంగా తమ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రాల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్‌గా హరికృష్ణ ఎన్నిక



హరికృష్ణను అభినందిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు

పార్వతీపురంటౌన్: ఏఐఎస్ఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా కన్వీనర్‌గా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు హరికృష్ణకు కండువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ సమరశీలమైన ఉద్యమాలు చేస్తుందని, భవిష్యత్తులో జిల్లాలో విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

ఆర్గానిక్ సాగులో 'రాజు'

- 'సేద్యం' చేసిన చూపిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- లక్షల్లో జీతం వదిలి సేంద్రియ వ్యవసాయం
- 26 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల పెంపకం
- ఏటా 300 టన్నులకు పైబడి ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి



ప్రకృతిసేద్యంలో వేసిన కర్బూజాను చూపిస్తున్న యువఇంజనీర్ అప్పలరాజు

పూసపాటిరేగ: కాన్పూర్ ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన సిమ్మ అప్పలరాజు లక్షలాది రుపాయల జీతాన్ని వదిలి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేశారు. ప్రముఖ సామాజిక వేత్త అన్నాహజారే స్ఫూర్తితో సేంద్రియ సాగు చేసి ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు తమ వంతు కృషి చేయాలని భావించారు. ఈ నేపథ్యంలో 26 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తున్నారు. వచ్చిన ఫలసాయాన్ని నామమాత్రపు ధరకే విక్రయిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని పెదపాడు తంగివానిపేటకు చెందిన యువ ఇంజనీర్ సిమ్మ అప్పలరాజు వ్యవసాయంపై మక్కువతో ఉద్యోగాన్ని వదిలిపెట్టి విజయనగరం జిల్లా పూసపాటిరేగ పెట్రోల్‌బంకు సమీపంలో 26 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు లేకుండా సేంద్రియ వ్యవసాయం చేస్తూ వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని భావించిన ఆయన సేంద్రియ సాగు పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహిస్తుండడంతో ఆయా పంటలకు బాగా గిరాకీ పెరిగింది. గడిచిన ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పండించిన పంటలను తమ ఇంటి నుంచే రాష్ట్రంతో పాటు దేశం నలుమూలలా ఎగుమతి చేస్తున్నారు. ఆరోగ్యసమస్యలు ఉన్న వారికి నామమాత్రపు ధరకే పంటలను విక్రయిస్తున్నారు. సేంద్రియ సాగులో టమాటో, కాప్సికమ్, బీర, వంకాయ, బెండ, క్యాబేజీ, కర్బూజాతో పాటు పలు కూరగాయలు పండిస్తున్నారు. ప్రకృతిసాగును ప్రభుత్వం ప్రోత్సహించడంతో గ్రామాల్లో ఇప్పటికే రైతులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

అరుదైన రకాల సాగు

ప్రకృతిసాగులో ఆయన అరుదైన టమాటో, బెండ, బీర, కాప్సికమ్, వంగ, బెండ, సొరకాయతో పాటు ఇతర రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలలా ఏటా 300 టన్నుల వరకు కూరగాయలు ఎగుమతి చేస్తున్నారు. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం పలు అనర్థాలకు తావిస్తుందని ఈ సందర్భంగా అప్పలరాజు హితబోధ చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. సేంద్రియ సాగు ద్వారా పండించిన కూరగాయలు వినియోగిస్తే బీపీ, షుగర్, ఆస్తమా వంటి వ్యాధులు నయమవుతాయని, ప్రకృతిసేద్యంలో పండించిన కూరగాయలకు మార్కెట్‌లో బాగా గిరాకీ ఉన్నట్లు తెలియజేశారు. ఆర్గానిక్ సాగు చేయడంలో కలిగిన సంతృప్తితోనే వ్యవసాయంపై మక్కువ బాగా పెరిగిందని అప్పలరాజు 'సాక్షి'కి తెలిపారు.



యువ ఇంజనీర్ అప్పలరాజు



వంగసాగు



ప్రకృతిసేద్యంలో క్యాబేజీ పంట



సొరకాయ సాగు

విద్యా సంస్థల బంద్ ను జయప్రదం చేయండి

- విద్యార్థి సంఘాల విజ్ఞప్తి



బంద్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈనెల 4న తేదీన దేశంలో గల విద్యాసంస్థల బంద్‌కు ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు కోరాయి. దీనికి సంబంధించి స్థానిక అమర్ భవన్‌లో విద్యార్థి సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్, పీడీఎస్ఓ నాయకుడు రాకేష్ మాట్లాడుతూ ఈ రోజుల్లో విద్యార్థులు బయటకు వచ్చి నిరసన తెలియజేస్తుంటే అక్రమ కేసులు పెట్టి విద్యార్థులను అణిచివేస్తున్న పరిస్థితి అని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది. ఇటీవల దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు నిర్వహించగా ఆ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. జీవో నంబర్ 77ను రద్దు చేయాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నైట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐఐటీ ముంబై నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు బనాయించడం, నిర్బంధం విధించడం ఆపివేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి గౌరీశంకర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రసాద్, భాను, జ్యోతి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రాజు, పీడీఎస్ఓ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వేంకటేశ్వరరావు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. గత నెల 30, ఈ నెల 1వ తేదీల్లో విశాఖ వేదికగా జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 4 బంగారు పతకాలు, 2 వెండి, 5 కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అంతేకాకుండా బంగారు పతకాలు దక్కించుకున్న నలుగురు క్రీడాకారులు ఆగస్టు 1,2,3 తేదీల్లో విశాఖలోని పోర్టు స్టేడియంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. బంగారు పతకాలు సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో చైతన్య, సృజన్, దీక్షశ్రీ, షణ్ముఖ్ అవినాష్‌లు ఉన్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అభినందించారు.

శివారు భూములకు సాగునీరు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: తాటిపూడి (గౌరిపాటి బుచ్చిఅప్పారావు) జలాశయం శివారు భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జామి, ఎస్.కోట, గంట్యాడ మండలాల్లోని 35 గ్రామాల్లో సుమారు 15,365 ఎకరాలకు సాగునీరు అందించే తాటిపూడి జలాశయం ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుందని తెలిపారు. వచ్చే ఏడాదికి కాలువల్లో పూడికలు తొలగిస్తామని చెప్పారు. విశాఖ నుంచి జలాశయానికి రావాల్సిన నిధుల కోసం ప్రయత్నం చేస్తామని తెలిపారు. పూర్తి భద్రతా ప్రమాణాలతో బోటును పునరుద్ధరించి ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ మాట్లాడుతూ వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా రంగాల అభివృద్ధికి ప్రణాళికలను రుపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఆర్‌డీఓ సూర్యకళ, ఇరిగేషన్ ఈఈ సీతారామనాయుడు, డీఈ గోవిందరావు, జేఈ తమ్మినాయుడు, ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



నర్సింహమూర్తి మృతదేహం



మృతి చెందిన రియాన్ హలం

బొండపల్లి: మండలంలోని అంబటివలస-నెలివాడ జంక్షన్‌ల మధ్య జాతీయ రహదారి (26)పై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు బలంగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతువాత పడ్డారు. మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలై జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని కణపాకకు చెందిన గంట్యాడ నర్సింహమూర్తి(25) తన తల్లి సరోజినితో కలిసి గజపతినగరంలో ఒక శుభకార్యానికి బైక్‌పై వచ్చి తిరిగి సాయంత్రం ఇంటికి విజయనగరం వెళ్తున్నారు. అదే సమయంలో విజయనగరం నుంచి సాలూరు వెళ్తున్న బీహర్‌కు చెందిన రియాన్ హలం(25) బైక్‌పై వస్తూ బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌లు నడుపుతున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

బైక్ వెనుక కూర్చున్న వారికి..

ప్రమాదంలో మృతి చెందిన నర్సింహమూర్తి తల్లి సరోజిని బైక్ వెనుకన కూర్చోగా తీవ్రగాయాలయ్యాయి. అలాగే బీహార్‌కు చెందిన రియాన్ బైక్ వెనుక కూర్చున్న స్నేహితుడు రోహిత్‌కు కూడా ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో క్షతగాత్రులను, మృతదేహాలను 108 వాహనంలో విజయనగరంలోని మహారాజా కేంద్రాస్పత్రికి పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

చీపురుపల్లి: విజయనగరం నుంచి హౌరా వెళ్లే రైలు మార్గంలో గరివిడి సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఆమదాలవలస జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధర్ తెలిపారు. ఆ వ్యక్తి రైలు నుంచి జారిపడ్డాడా? లేదంటే మరే ఇతర కారణాల వల్ల మృతిచెందాడో తెలియదని పేర్కొన్నారు. మృతుడికి దాదాపు 60 సంవత్సరాలు వయస్సు కలిగి, శరీరంపై నీలం రంగు జీన్ ఫ్యాంట్, నలుపు రంగు డ్రాయర్, తెలుపు రంగు బనియన్, ఆకుపచ్చ, తెలుపు రంగు గడులతో కూడిన ఫుల్‌హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా మృతునికి తల వెనుక భాగం, రెండు చేతులు, కాలి మడమ, నడుము వెనుక భాగంలోను గాయాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే నోరు, ముక్కు నుంచి రక్తస్రావం జరిగినట్లు మరకలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9491106219 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అనధికార ఎరువుల పట్టివేత

పాచిపెంట: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాలకు అనధికారికంగా తరలిస్తున్న ఎరువులను పట్టుకున్నట్లు ఏఓ తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, 13 బస్తాల ఎరువులు తరలిస్తుండగా రొడ్డవలస గ్రామ సమీపంలో పట్టుకున్నామన్నారు. రశీదులు లేకుండా ఈ ఎరువులను పాచిపెంట మండలానికి చెందిన ఆత్మకూరు శ్రీనువాసరావు అనే వ్యక్తి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.కాగా అక్కడి రైతులకు పెట్టుబడిగా తాను ఎరువులు పంపిస్తున్నానని ఇకనుంచి వారికి నేరుగా నగదును పెట్టుబడిగా ఇస్తానని శ్రీనివాసరావు చెప్పినట్లు ఏఓ తెలిపారు.

అధికారులే పింఛన్ పంపిణీ చేయాలి

- టీడీపీ నేతలు పంచడం అప్రజాస్వామికం
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని అధికారులే చేయాలి తప్ప టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పంపిణీ చేయించడం సమంజసం కాదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు పట్టణంలోని తన గృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులను పిలవకుండా చాలా ప్రాంతాల్లో స్థానిక టీడీపీ నాయకులతో అధికారులు పింఛన్లు పంపిణీ చేయించారని అసహనం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము మండల, మున్సిపాలిటీ స్థాయిలో పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమం నిర్వహించే సమావేశంలో ఆ పంచాయతీ/ వార్డు ప్రజాప్రతినిధి ద్వారా సంబంధిత లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందించామని గుర్తుచేశారు. వార్డుల్లో ,గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వలంటీర్లు అత్యంత పారదర్శకంగా పింఛన్ సొమ్ము నేరుగా లబ్ధిదారులకు అందజేసేవారని, ఎక్కడా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వెళ్లేవారు కాదని వివరించారు. 2014లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కలెక్టర్‌లతో ఏర్పాటుచేసిన సమావేశంలో, టీడీపీ కార్యకర్తలను చూసుకుని వెళ్లాలని చెప్పారని, అందుకే ఇప్పుడు వారికి పింఛన్ల పంపిణీలో అవకాశం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. పింఛన్ సొమ్ము పంపిణీలో ఏదైనా అవినీతి జరిగితే సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో బాణసంచా వెలుగులు



పట్టణంలోని గాంధీ బొమ్మ కూడలిలో బాణసంచా కాల్చుతున్న గుర్తు తెలియని వ్యక్తులు

- చర్చాంశనీయంగా మారిన బాణసంచా
- వ్యాపార సంస్థలపై దాడులే కారణమా
- గుర్తు తెలియని వ్యక్తులు బాణసంచా కాల్చిన వైనం
- జీఎస్టీ అధికారులు బృందం దాడుల నేపథ్యంలో..
- ఐదేళ్ల తరువాత కొత్తగా అనిపించిన అంశం

చీపురుపల్లి: ఇదేదో పండగ కాదు.. ఎన్నికల విజయోత్సవ వేడుకలు అంతకంటే కాదు.. చీపురుపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో పలు చోట్ల ఒక్కసారిగా మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో బాణసంచా కాల్చారు. ఎవరు కాల్చారో.. ఎందుకు కాల్చారో తెలియదు. బాణసంచా కాల్చిన అంశంపై స్థానికంగా చర్చాంశనీయాంశమైంది. జీఎస్టీ అధికారుల బృందం పట్టణంలోని వ్యాపార సంస్థలపై మంగళవారం దాడులు నిర్వహించింది. ఈ విషయం ముందుగానే తెలుసుకున్న వ్యాపార వర్గాలు మధ్యాహ్నం నుంచి తమ వ్యాపార సంస్థలను మూసివేశారు. పట్టణంలోని మెయిన్‌రోడ్ అంతా నిర్మానుష్యంగా మారింది. తీరా రాత్రి 8.30 గంటలయ్యే సరికి ఇలా బాణసంచా కాల్చడం స్థానికంగా చర్చకు దారి తీసింది. గత ఐదేళ్లలో ఈ పరిస్థితి ఎన్నడూ కనిపించలేదు. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ పరిపాలనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారులు తమ వ్యాపారాలు కొనసాగించారని, ప్రభుత్వం మారిన అతి కొద్ది రోజుల్లోనే ఇప్పటికే రెండు సార్లు వ్యాపార సంస్థలపై అధికారులు దాడులు ప్రారంభమయ్యాయనే వాదన వ్యాపార వర్గాలు నుంచి వినిపించింది. జీఎస్టీ అధికారుల బృందం దాడుల నేపథ్యంలో నిబంధనల ప్రకారం వ్యాపారాలు సాగిస్తున్న సంస్థలు తప్ప మిగిలిన వారంతా తమ వ్యాపార సంస్థలను మూసివేశారు. గతంలో చిరు వ్యాపారులే అధికారులకు బలయ్యేవారు. ఇప్పుడు అధికారులు బృందం దాడులతో పెద్ద వ్యాపారులు కూడా వ్యాపారాలను మూసేయాల్సి వచ్చింది. చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బాణసంచా కాల్చడం చర్చకు దారి తీసింది.

బియ్యం మాత్రమే పంపిణీ..!

- రేషన్ సరుకుల్లో కందిపప్పు, చక్కెరకు కోత



రామభద్రపురంలో బియ్యం పంపిణీ చేస్తున్న వాహనదారులు

రామభద్రపురం: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఈ నెల పంపిణీ చేసే రేషన్ సరుకుల్లో బియ్యం మాత్రమే కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. చక్కెర, కందిపప్పు, రాగులు, రాగిపిండికి కోత పెట్టారు.ఏవో సాకులు చూపి మిగిలిన ఇవ్వకుండా కోతలు పెట్టారని రేషన్‌కార్డు లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి మండలంలో 35,954, బాడంగి 14,813, రామభద్రపురం 15,328, తెర్లాం 18,742 రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం కార్డుదారులను ఈ నెల బియ్యానికే పరిమితం చేసింది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు,పంచదారల రేట్లు అధికంగా ఉండటంతో ఈ సరుకులు కొనుగోలు చేసి తినే పరిస్థితి లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు కిలో రూ.120కి పైనే ధర పలుకుతోంది. ఇలాంటి తరుణంలో రేషన్‌లో కందిపప్పు పంపిణీ చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై సీఎస్‌డీటీలు ధనలక్ష్మి, స్వర్ణలతలను వివరణకోరగా గోదాంలకు ఒక్క బియ్యం మాత్రమే స్టాక్ వచ్చిందన్నారు. కందిపప్పు,పంచదార స్టాక్ రాలేదని, దీంతో ఆ రెండు సరుకులు పంపిణీ చేయడం లేదన్నారు. వచ్చే నెలలో స్టాక్ వస్తే పంపిణీ చేస్తామని తెలిపారు